
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నంద్యాల జిల్లా వార్తలు 5
సోమవారం 18 నవంబరు 2024

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు అధికారులందరూ హాజరు కావాలన్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఇద్దరి మృతి


నాగూర్ బాషా, రాఘవేంద్ర మృతదేహాలు

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూలీపని కోసం అరటి కాయలు మోసేందుకు వెళ్లి అక్కడ జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం మహానంది మండలం అబ్బీపురంలో చోటు చేసుకొంది. మండలంలోని అబ్బీపురం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ బాషా(43), కర్నూలు జిల్లా మద్దికెర మండలం పెరవలికి చెందిన బోయ రాఘవేంద్ర(46) ఆదివారం మరి కొందరు కూలీలతో కలసి మండలంలోని కృష్ణనంది సమీపంలోని అరటి గెలలను కోసేందుకు మినీ లారీలో వెళ్లారు. రాఘవేంద్ర మినీ లారీకి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గెలలను కోసి లారీలో లోడ్ చేశాక, మిగతా కూలీలు లారీ వెంట నడిచి రాగా నాగూర్‌బాషా లారీ డ్రైవింగ్ చేస్తుండగా రాఘవేంద్ర వాహనంలో బయల్దేరాడు. అబ్బీపురానికి కిలో మీటర్ దూరంలోని ఐదు మాన్ల చెట్ల రహదారిలో 11 కెవి విద్యుత్ కేబుల్ తగలడంతో లారీ ప్రమాదానికి గురైంది. డ్రైవర్ రాఘవేంద్ర, నాగూర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా కూలీలు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులకు సమాచారం అందించారు. మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకరరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని సిబ్బంది ద్వారా వివరాలను సేకరించారు. మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.


ప్రమాదానికి గురైన మినీ లారీ

శైవ క్షేత్రాల్లో ప్రధాన న్యాయాధికారి పూజలు


కృష్ణనందిలో పూజలు చేస్తున్న ప్రధాన న్యాయాధికారి కబర్ది దంపతులు

బండిఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శైవ క్షేత్రాల్లో కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది, ఆయన సతీమణి గాయత్రి, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి మల్లీశ్వరి పూజలు నిర్వహించారు. మండలంలోని ఓంకారం, శివనంది క్షేత్రాల్లో ఆదివారం న్యాయమూర్తులకు ఈవో నాగప్రసాద్ అర్చకులతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు ఆయా క్షేత్రాల్లో గంగా ఉమా సమేత సిద్ధేశ్వర, శివనందీశ్వర స్వామివార్లకు పూజలు చేశారు. అలాగే కృష్ణనంది క్షేత్రంలో స్వామివార్లను న్యాయాధికారి దంపతులు పూజలు చేశారు.

మట్టి మాఫియా

- పేదల పట్టా భూముల్లో తవ్వకాలు
- కుందూ నది పక్కనే భారీ యంత్రంతో పనులు
- చీకటి పడగానే ట్రాక్టర్లతో తరలింపు
- ఏడడుగుల మేర గుంతలు

నంద్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. నందమూరి నగర్ టిడ్కో ఇళ్ల వెనుక కుందూ నది ఒడ్డున భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపి మట్టి కొల్లగొడుతున్నారు. చీకటి పడగానే ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించుకపోయి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ఉన్నాయా? లేదా? అనే సంగతి పక్కనపెడితే, ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిన భూముల్లో అక్రమార్కులు మట్టి తవ్వడం విస్మయం కలిగిస్తోంది. వీరి తీరు వల్ల పేదలు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావటమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. ఈ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.


నందమూరి నగర్ టిడ్కో ఇళ్ల వెనుక పేదల పట్టాల ప్రాంతంలో మట్టి తవ్వుతున్న దృశ్యం


పేదలకు కేటాయించిన పట్టాల సరిహద్దును చూపే రాళ్లు

నందమూరి నగర్ టిడ్కో ఇళ్ల వెనుక కుందూ నది వెంట దాదాపు ఆరువేల మంది పేదలకు పట్టాలు ఉన్నట్లు సమాచారం. పట్టాలు తీసుకున్నారేగాని పేదరికం వల్ల ఇళ్ళు కట్టుకోలేదు. ఈ ప్రాంతమంతా పూర్తిగా పిచ్చి మొక్కలు మొలవటంతో ఇక్కడ ఇండ్ల స్థలాలు ఉన్నాయని గుర్తు పట్టేలా పరిస్థితి లేదు. పైగా నందమూరి నగర్‌కు వెళ్లే దారికి కాస్త పెడగా ఉండటంతో ఈ ప్రాంతం ఊరికి చివర్లో ఉన్నట్లనిపిస్తుంది. ఇదే అదనుగా కొంతమంది ఇక్కడ మట్టిని తవ్వి కళ్లు గప్పి తరలించుకపోతున్నారు. పది దాటగానే ఈ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారుతోంది. అపుడు ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 200 ట్రాక్టర్ల మట్టిని తరలించినట్లు తెలుస్తోంది. పేదల స్థలాలను గుర్తించే సరిహద్దు రాళ్లను తొలగించి భారీ యంత్రాలతో తవ్వుతున్నారు. ప్రాంతంలో ఇప్పటికే ఏడడుగుల మేర భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ ఎంత తవ్వినా అడిగేవారు లేరు కాబట్టి వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకుని కోట్ల రూపాయలు జేబులో వేసుకోవచ్చన్నది అక్రమార్కులు వన్నాగం. దీనిని బట్టి మట్టి మాఫియా నంద్యాలలో ఎలా రెచ్చిపోతోందో అర్థమవుతోంది. ఈ తవ్వకాలను ఆపకపోతే పట్టాలు అందుకున్న వేల మంది పేదలు అన్యాయమైపోతారు. ఆఖరుకి తమ భూములు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ యంత్రాంగం సర్వే చేసి అసలు అక్కడ ఎవరి భూమి ఎక్కడ ఉన్నదీ నిగ్గుదేల్చడం కష్టమైపోతుంది. ప్రజా సంఘాల నాయకులు లేదా ఇతరులు ఎవరైనా పేదల భూములు చూపెట్టమని కోర్టుకు ఎక్కితే చివరకు చిక్కుల్లో పడేది అధికార యంత్రాంగమే అనే విమర్శలు వస్తున్నాయి.


పేదలకు పట్టాలు ఇచ్చిన ప్రాంతం ఇదే

మిగతా 7లో..

నదీ ప్రవాహాన్ని మార్చేలా..

ప్రస్తుతం అక్రమార్కులు మట్టిని తవ్వే ప్రాంతం కుందూ నదికి పది అడుగుల దూరంలో ఉన్నది. కుందూనదికి సంబంధించి నందిపల్లె నుంచి వచ్చే ఒక పాయ, సంతజూటూరు నుంచి వచ్చే మరో పాయ ఈ ప్రాంతంలోనే కలుస్తాయి. అక్రమార్కులు చేసిన పనికి భవిష్యత్తులో కుందూ నదికి ప్రవాహం ఎక్కువ వచ్చి సరిహద్దుగా ఉన్న కాస్త మట్టి కట్ట తెగితే నీరంతా ఈ గుంతల్లో నిండిపోతుంది. ఇది ఇలాగే కొనసాగితే కుందూ ప్రవాహం మారి టిడ్కో ఇళ్ల వైపు చొచ్చుకుని వచ్చే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రజలు నష్టపోతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధన దాహంతో వేల మంది ఇబ్బందుల్లో పడేలా అక్రమ దందాలు చేస్తున్నా వాటిని అడ్డుకట్ట వేయటంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది.

నిబంధనాల్లో పత్తి రైతు


ఆదోని మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి

- ఎండమావిగా సీసీఐ మద్దతు ధర
- ఒక రైతు నుంచి ఎకరాకు 5 క్వింటాళ్లే కొనుగోలు
- తేమ ఉందంటూ మరో కొర్రి
- ఇప్పటికి కొన్నది 2400 క్వింటాళ్లే
- అడ్డగోలు నిబంధనలతో పత్తి రైతు అవస్థలు
- తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతున్నరైతులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి ధర మరింత పతనమయింది. మార్కెట్ యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే క్వింటం పత్తి రూ.600 తక్కువకు వ్యాపారులు కొంటున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నది. ఎకరాకు మొదటి కోత 5 క్వింటాళ్లకు మించి కొనలేమని కరాఖండిగా చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. మరోవైపు పత్తిలో తేమ ఉందని పేచి పెడుతున్నారు. నిబంధనల సుడిగుండంలో రైతులు పత్తి అమ్ముకోడానికి అవస్థ పడుతున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, సీసీఐ సమన్వయ లోపం పత్తి రైతులకు శాపంగా మారింది. పత్తి విక్రయించుకోవడానికి వందల సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్న రైతులు కేంద్రాలకు వస్తే నిబంధనలతో తిరస్కరిసున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2.15 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో ఎకరాకు 12-15 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులు సంబరపడ్డారు. అంతలోనే పత్తి ధరలు పతనం కావడంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాలేని పరిస్థితి. మద్దతు ధర కంటే తక్కువగా మార్కెట్ కమిటీలో పత్తిని వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ అప్రమత్తమై సీసీఐను రంగంలోకి దించింది. కనీస మద్దతు ధర క్వింటం రూ.7521తో ఆదుకుంటుందని రైతులు ఆశించారు. పత్తి పంట సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు వస్తాయి. లాభాలు లేకపోయినా అప్పులు తీర్చుకోవచ్చని అనుకున్నారు. కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించడంతో రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకున్నారు. తీరా కొనుగోలు కేంద్రాలకు పండించిన పత్తిని రైతులు తీసుకొస్తే నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్నారు. దీపావళి కంటే ముందే ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడులలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా, రైతుల నుంచి కొనుగోలుకు మాత్రం 5 రోజులు కిందే మొదలు పెట్టారు. . ఇప్పటివరకు 144 మంది రైతులు నుంచి కేవలం 2400 క్వింటాళ్లే పత్తిని కొనుగోలు చేసినట్టు సీసీఐ అధికారులు తెలుపుతున్నారు.


తేమశాతాన్ని మిషన్ ద్వారా పరిశీలిస్తున్న సీసీఐ సిబ్బంది

మార్కెట్లో రోజుకు పదివేల క్వింటాళ్లు

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ప్రతిరోజు 10వేల నుంచి 12వేల క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొంటున్నారు. పత్తిధర గరిష్ఠంగా రూ.7100 మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. తక్కువ ధరకే ఇన్ని వేల క్వింటాళ్ల వేల మంది రైతులు విక్రయిస్తున్న సీసీఐ నిబంధనల వల్ల మద్దతు ధరకు అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆదోని, కౌతాలం, పెద్దకడుబురు, హాలహర్వి, ఆలూరు, చిప్పగిరి, మంత్రాలయం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, ప్రాంతాల్లో ఎకరాకు 12-14 క్వింటాళ్లపైగానే దిగుబడి వచ్చింది. కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలో ఎకరాకు 16నుంచి 18 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. దిగుబడి అధిక మొత్తంలో వచ్చినా వ్యవసాయ శాఖ మాత్రం కేవలం ఎనిమిది క్వింటాళ్లకు దిగుబడి మించలేదని నివేదిక పంపడంతో సీసీఐకి విక్రయించుకునేందుకు కేవలం ఎనిమిది క్వింటాళ్లేనని నిబంధనలు పెట్టింది. దీంతో పత్తి రైతులు అమ్ముకోలేక అవస్థలు పడాల్సిన పరిస్థితి. అమ్ముకునేందుకు కూడా పత్తి రైతులు ఆసక్తి చూపడం లేదు.

మిగతా 7లో..

శ్రీగిరిపై కార్తీక కాంతులు

- భక్తులతో కిటకిటలాడిన శ్రీశైల క్షేత్రం
- నేడు లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు

శ్రీశైలం, నవంబరు 17 (ఆంధ్రజోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారాల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాఢవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. దేవస్థానం అధికారులు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ అందజేస్తున్నారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలు నిర్రవహించారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనల కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకు దేవస్థానం కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించారు.


పూజలు చేస్తున్న భక్తులు

నేడు లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు

కార్తీక ముడవ సోమవారం పురస్కరించుకొని సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించనుంది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా పూజాధికాలు జరిపి అనంతరం పుష్కరిణికి దశవిధ హరతులు సమర్పించనున్నారు. లక్షదీపోత్సవం కార్యక్రమం సందర్భంగా పుష్కరిణి ప్రాంగణమంతా దీపాలను ఏర్పాటు చేయనున్నారు.


దర్శనానికి కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు

వైద్య సిబ్బంది సస్పెండ్

నంద్యాల కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన జోన్ మండలం కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన, విధులకు గైర్హాజరైన వైద్య సిబ్బంది ఐదుగురిని సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎఫ్ఎన్‌వో నీలిమ, తోటీ నాగరాజును, విధులకు గైర్హాజరైన స్టాఫ్‌నర్సు అన్నపూర్ణ, ఫార్మసిస్ట్ రేఖ, సీనియర్ అసిస్టెంట్ శంకరమ్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.



పులిరాజు ప్రాభవం

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సూచికలో పెద్దపులికి ప్రాధాన్యత ఉంది. పలు దేశాలు పెద్దపులిని తమ జాతీయ జంతువుగా ప్రకటించుకున్నాయి. ఇందులో భాగంగానే సైబీరియన్ జాతిలోని ఫాన్థెరటైగ్రీస్ కుటుంబానికి చెందిన పెద్దపులిని మన దేశం జాతీయ జంతువుగా ఎంచుకుంది. 1972 నవంబరు 18వ తేదీన పెద్దపులిని జాతీయ జంతువుగా భారత ప్రభుత్వం స్వీకరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే జంతువుగా పేరుగాంచిన పెద్దపులి ప్రాముఖ్యతపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ప్రపంచంలో సుమారు 8జాతులకు చెందిన పెద్దపులులు ఉన్నట్లు గుర్తించారు. అందులో బెంగాల్‌టైగర్, ఇండోచైనీస్ టైగర్, మలయన్ టైగర్, సుమత్రన్ టైగర్, సైబీరియన్ టైగర్, సౌత్‌చైనా జాతులకు చెందిన టైగర్లు ఉండగా బాలినీస్ టైగర్, జావన్‌టైగర్లు అంతరించిపోయినట్లు జంతు పరిశోధకులు గుర్తించారు. కాగా బెంగాల్ టైగర్‌ను మన జాతీయ జంతువుగా ప్రభుత్వం 1972 నవంబర్ 18వ తేదిన ప్రకటించింది.

పెద్దపులికి ప్రపంచంలో ఉండే ప్రాముఖ్యత

మనదేశం 1972 నవంబర్ 18వ తేదిన పెద్దపులిని జాతీయ జంతువుగా ప్రకటించి వాటి సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేసింది. ఇంతటి విశిష్టత కలిగిన పెద్దపులి అవయవాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ వుందని చెప్పవచ్చు. విదేశీ మార్కెట్‌లో పులి చర్మం కనీస ధర రూ.20 లక్షల పైబడి పలుకుతున్నట్లు తెలుస్తోంది.



దేశానికే తలమానికం నల్లమల

నల్లమలలో విస్తరించిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పులుల సంరక్షణలో దేశానికే తలమానికంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82 చ.కి.మీల పరిధిలో విస్తరించి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. ఇందులో 2444 చ.కి.మీల కోర్ ఏరియా ఉండగా, 1283.82 కిమీల బఫర్ ఏరియా గుర్తించారు. కాగా ఎన్ఎస్‌టీఆర్‌లో 2014-15లో 37పెద్దపులుల ఉండగా ప్రస్తుత గణాంకాల ప్రకారం 2023-24లో ఎన్ఎస్‌టీఆర్‌లో 87 పెద్దపులులు ఉన్నట్లు అంచనా. మొత్తంగా పులికూనలతో కలిపి వందకుపైగానే ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది మార్చి నెలలో ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్‌లోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో ఓ పెద్దపులి నాలుగు ఆడపులి కూనలకు జన్మనిచ్చింది. అయితే తల్లిపులి నుంచి పులికూనలు దూరమైనప్పటికీ ఒకే ఈతలో ఏకంగా నాలుగు పులి కూనలకు జన్మనివ్వడం దేశవ్యాప్తంగా సంచనంగా మారింది. తల్లినుంచి దూరమైన పులికూనలను అటవీ అధికారులు ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జూపార్క్‌లో సంరక్షిస్తున్నారు. వాటిలో ఒక పులికూన మరణించగా, మిగినవి సురక్షితంగా ఉన్నాయి. రెండేళ్ల తర్వాత వాటిని తిరిగి నల్లమల అడవిలోనే వదిలేస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు.

- దేశానికేతలమానికం నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్
- జాతీయ జంతువుగా గుర్తింపు వచ్చి 52 వసంతాలు
- నేడు పెద్దపులిని భారత ప్రభుత్వం జాతీయ జంతువుగా స్వీకరించిన దినం..


కూనలతో పెద్దపులి

పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడే కీలకం



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడ ఎంతో కీలకం. పులి ఆవాసాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పర్యావరణం సమతౌల్యంగా వుంటుంది. పులుల రక్షణకై అటవీశాఖ ఎంతో కృషి చేస్తోంది. ప్రత్యేకించి పులుల ప్రత్యుత్పత్తి కోసం అడవుల్లో అనుకూల వాతావరణ పరిస్థితుల్ని ఏర్పాటు చేస్తున్నది.
- వి. సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

మట్టి మాఫియా

(5వ పేజీ తరువాయి)


మట్టిని తవ్వడంతో ఏడడుగుల మేర ఏర్పడిన గుంతలు

గత ప్రభుత్వ హయాంలో నంద్యాలలో చెరువులు, కుంటలు, పంట భూములు.. అదీ ఇదీ అని లేకుండా ఎక్కడ పడితే అక్కడ వైసీపీ అనుయాయులు విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేపట్టేవారు. దీనిపైన ప్రజల నుంచి విపరీతమైన వ్యతిరేకత వ్యక్తమైనా, అధికారులు చర్యలు తీసుకున్నా ఆగలేదు. ఇలాంటి పనుల వల్లే ప్రజలు వైసీపీని లేవలేని చావుదెబ్బ తీశారు. ప్రభుత్వం మారింది. ఇక నుంచి ఇలాంటి ఉండవని అందరూ భావించారు. మారింది ప్రభుత్వమే కాని, అక్రమార్కుల తీరు కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో ఆ పార్టీ అనుచరులు చెలరేగిపోతే, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నందమూరి నగర్‌లో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలోని కొంత మంది ఈ ప్రాంతంలో రాత్రిపూట గస్తీ కాస్తూ పోలీసులు ఎవరైనా వస్తున్నారా? ఇతర అధికారులు ఎవరైనా నిఘా పెట్టారా? అని గమనిస్తూ మట్టి రవాణాకు అడ్డంకులు లేకుండా చూసుకుంటున్నారు. ఇలా తరలిస్తూ నంద్యాల శివారులోని ఇటుక బట్టీలకు, వెంచర్లకు ట్రాక్టరు మట్టిని రూ.1500, టిప్పరు మట్టిని రూ.8000 పైగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. గత ప్రభుత్వాలు చేసిన తప్పులు ప్రస్తుతం చేయకూడదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టంగానే చెబుతున్నారు. జిల్లా పై స్థాయి నాయకులు కూడా ఇదే మాట చెబుతున్నారు. కానీ కింది స్థాయి టీడీపీ నాయకులు ఈ మాట లను ఏమాత్రం పట్టించుకోవటం లేదు. అధికారం తమదే కాబట్టి తమను ఎవరూ అడగరని, ఒకవేళ తమ అక్రమాలను అధికారులు అడ్డుకున్నా ఆపై అధికారులతో పని చేసుకోవచ్చనే ధీమాతో మట్టి అక్రమార్కులు రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


సరిహద్దు రాయిని తొలిగించిన దృశ్యం

రిచ్‌మండ్ విల్లా కాలనీలో చోరీ

- 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ

కర్నూలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రిచ్‌మండ్ విల్లా కాలనీలో చోరీ జరిగింది. వివరాలివీ.. నాగార్జున తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నంద్యాలకు వెళ్లారు. ఆదివారం నాగార్జున ఇంట్లో లైట్లు వెలుగుతుండటంతో పక్కింటి వారు ఆయనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో నంద్యాల నుంచి వచ్చిన నాగార్జున తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనాల్లో పత్తి రైతు

(5వ పేజీ తరువాయి)

సీసీఐ నిబంధనలు ఇవే....

- పత్తి రైతు ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు చేసుకొని ఉండాలి.
- గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలలో ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలి.
- పేర్లు నమోదు చేసుకున్నా సీసీఐ చెప్పిన రోజే కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకెళ్లాలి.
- పత్తి బోరాల్లో కాకుండా లూజుగా వాహనాల్లో తేమ లేకుండా తీసుకెళ్లాలి
- తేమ 8శాతం నుంచి 12శాతానికి మించరాదు
- పత్తికి 8శాతం ఉంటేనే కనీసం మద్దతు ధర రూ. 7521 చెల్లిస్తారు
- తేమశాతం ఒక్క శాతం అధికమైన రూ.75పైగా కోత
- పట్టాదారు, పాస్ పుస్తకం బ్యాంకు ఖాతా నెంబరు ఉండాలి
- కొనుగోలు చేశాక పది రోజుల తర్వాత చెల్లింపులు రైతు ఖాతాలో జమ
- ఎకరాకు మొదటి కోత దిగుబడిలో 40 శాతం మాత్రమే మొదట కొనుగోలు. అలా మూడు సార్లు విక్రయించుకునేందుకు నిబంధన
- సోమవారం నుంచి శుక్రవారం వరకు వారానికి ఐదు రోజులే కొనుగోలు
- కొనుగోలు కేంద్రాలకు వచ్చాక నిబంధనల పేరుతో సతాయింపు.


విక్రయానికి రైతులు తీసుకొచ్చిన పత్తి

మద్దతు ధర ఉత్తిదే



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ఉత్తిదే. మార్కెట్లో ధరలు పతనమైనప్పుడు ఆదుకోవాల్సిన ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ రైతులను సతాయిస్తున్నారు. దిగుబడి ఉన్నా ధర లేక సీసీఐకి విక్రయించుకుందామంటే ఎకరాని ఇంతే కొంటామంటూ చెప్పండం భావ్యం కాదు. తీరా కొనుగోలు కేంద్రానికి వచ్చాక కొనుగోలు చేస్తారన్న నమ్మకం కూడా లేకుండాపోయింది. నిబంధనల వల్ల మద్దతు ధరకు అమ్ముకోలేక తక్కువ ధరకే అమ్ముకుంటున్నాము.
- సీతారాం రెడ్డి, పత్తి రైతు, నెరణికి గ్రామం, ఆలూరు

నిబంధనలు సడలించాలి

మార్కెట్‌లో రోజురోజుకు పత్తి ధరలు పతనమవుతున్నాయి. మద్దతు ధర కల్పిస్తామని సీసీఐ కొనుగోలు చేస్తున్న రైతులకు నిబంధనలు పెట్టింది. తేమశాతం, ఎకరాకు మొదట 40శాతం కొంటామని చెప్పడం రైతులను ఇబ్బందులు కలిగించడమే. నిబంధనలు సడలించి రైతుతో ఎన్ని క్వింటాళ్ల పత్తి ఉన్న సీసీఐ మద్దతు ధరలో కొనుగోలు చేయాల్సిందే లేనిపక్షంలో రైతులతో ఆందోళన చేపట్టాల్సి వస్తుంది.
- వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆదోని

నిబంధనల మేరకే కొనుగోలు

వ్యవసాయ శాఖ దిగుబడి సూచించిన మేరకే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నాం. వ్యవసాయ శాఖ ఆన్‌లైన్‌లో మొదటికోతలో ఎకరాకు ఎంత వస్తే అంతే ఆ రైతు నుంచి కొంటాం. అలా మూడు దశల్లో రైతులు విక్రయించుకోవచ్చు. మా చేతుల్లో ఏమీ లేదు.
- సీసీఐ కేంద్ర బాధ్యుడు, ఆదోని

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



వ్యవసాయ శాఖ దిగుబడి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపింది. సీసీఐ మూడు విడతల్లో రైతు నుంచి కొనుగోలు చేస్తుంది. మొదట విడతలో 40శాతం పత్తి దిగుబడి, రెండో విడతలో 40శాతం, చివరి కోత దిగుబడి 20శాతం కొంటుంది. కొన్ని నిబంధనలు సడలించాలని ప్రభుత్వాన్ని కోరాం. రైతులు ఆందోళన చెందకుండా మద్దతు ధరకు విక్రయించుకోవాలి.
- రామ్మోహన్ రెడ్డి, కార్యదర్శి, ఆదోని

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 2024-2025 విద్యా సంవత్సరానికిగాను ఎస్‌సి, ఎస్‌టి, బీసి, మైనార్టి, కాపు, విద్యార్థులు తమ విద్యాబోధన ఫీజులు, ఉపకారవేతనాలు మంజూరు కోసం ఫ్రెష్, రెన్యువల్స్ కోసం జ్ఞానభూమి వెబ్ సైట్‌లో ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యాసంవత్సరానికిగాను 11,389 మంది విద్యార్థులకు కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో రిజిస్ట్రేషన్ లక్ష్యంకాగా, 2828 మాత్రమే పూర్తి చేశారన్నారు.

నేడు కేజీబీవీలో అభ్యర్థులకు కౌన్సెలింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో బోధన, బోధనేతర పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆదనపు పథక సమన్వయ కర్త శామ్యూల్ పాల్ ఆదివారం తెలిపారు. దీనికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో వెల్లడించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సోమవారం కర్నూలు నగరానికి రానున్నట్లు నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో ఆయన పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీ కలెక్టరేట్‌కు బయలుదేరుతుందని తెలిపారు.

25న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఐదుగురు మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో మంత్రి సుధారాణి



శ్రీశైలం, నవంబరు 17(ఆంధ్రజోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సుధారాణి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి సుధారాణికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. భ్రమరాంబ అతిథి గృహంలో మంత్రికి స్థానిక గిరిజన సంఘాల నాయకులు శ్రీశైలం పరిధిలో చెంచు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. చెంచు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో శివప్రసాద్, సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. మరోసారి శ్రీశైలంలో పర్యటించి చెంచు గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ముగ్గురిపై కేసు

చాగలమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలోని ఓ పాఠశాలలో బాలికపై అత్యాచారయత్నం కేసులో పదోతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు, పాఠశాల కరస్పాండెంట్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టుకు తీసుకెళ్లామని చెప్పారు. కర్నూలు సివిల్ కోర్టుకు ఇద్దరు విద్యార్థులు, కరస్పాండెంట్‌ను కోవెలకుంట్ల కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

మహానందిలో డీఐజీ పూజలు

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో కార్తీకమాసం పురస్కరించుకొని ప్రధాన ఆలయాల్లో డీఐజీ కుటుంబ సమేతంగా ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. కల్యాణ మండపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని ఆశీర్వదించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వామివారి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


డీఐజీ కోయ ప్రవీణ్‌కు స్వామి మెమెంటోను అందజేస్తున్న ఈవో

అక్రమాలకు పాల్పడిన వారిని వదలి పెట్టం

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎవర్నీ వదలి పెట్టమని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఎన్నో అక్రమ లేఅవుట్లు వేశారని, లే అవుట్‌కు ఆన్‌లైన్ ద్వారా అప్రూవల్ వేయాల్సి ఉండగా పంచాయతీ సెక్రటరీలు తమ పరిధిలోని లే అవుట్లకు ఆన్‌లైన్ అప్రూవల్ చేయించకుండా ఆన్‌లైన్ ద్వారా అప్రూవల్ చేసి అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. దీన్ని అరికట్టడానికి డీపీవోలతో చర్చించిన అనంతరం పంచాయితీలను డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రజల కోసం అన్ని వసతులు అందుబాటులో ఉంచేందుకు ఎన్‌టీఆర్ టౌన్ షిప్‌లో తక్కువ ధరలో పేదలకు ప్లాట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైఎస్ జగన్‌చేసిన అవినీతి వల్ల అధికారులందరూ ఇరుకున్నారని, వారికి శిక్ష దారుణంగా ఉంటుందని అన్నారు.

మహానందిలో కార్తీక సందడి


మహానంది ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కోనేర్లలో కార్తీక పుణ్య స్నానాలను ఆచరించారు. అనంతరం మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే అధిక సంఖ్యలో సామూహిక అభిషేకాలు జరిగాయి. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ. లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాగా కార్తీక మూడో సోమవారం మహానందిలో మరింత భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

వరికి గిట్టుబాటు ధర కల్పించాలి



పార్నపల్లెలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బండిఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పార్నపల్లె గ్రామంలో రైతులతో కలిసి నాయకులు సుధాకర్‌రెడ్డి, బసిరెడ్డి, నరసింహులు నిరసన వ్యక్తం చేశారు. బస్తా వరి ధాన్యం రూ.1400కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, ఎలాంటి గిట్టుబాటు లేకపోగా రైతులు అప్పులపాలవటం ఖాయమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రత్నమయ్య, డేవిడ్, రాజు, పవీ, రామచంద్రారెడ్డి, శీను పాల్గొన్నారు.

పోలీసు స్థలంలో పారిశుధ్య పనులు


పోలీసు శాఖ స్థలంలో కంపచెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

పాణ్యం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : పాణ్యంలోని పోలీసు శాఖకు చెందిన స్థలంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆదివారం స్థలంలో కంప చెట్లు, ముళ్ల పొదలు తొలగించారు. పోలీసు నివాస గృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ ప్రాంతంలో కంప చెట్లు పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం సర్వే చేయించి పోలీసు శాఖ స్థలం హద్దుల వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

పోరాట యోధుల గురించి తెలుసుకోవాలి

పాణ్యం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకోవాలని గ్రంథాలయాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, పోరాటాలు. దేశానికి చేసిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు. సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యత


నాయీబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పలకవీటి విజయకుమార్‌ను సత్కరించిన నాయకులు

ఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పలకవీటి విజయకుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఆత్మకూరు రావడంతో స్థానిక నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుర్తు చేశారు. ఆ యాల్లో కూడా సముచిత స్థానం ఇవ్వనుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్టీసీ రామకృష్ణుడు, శివ పాములేటి, పెద్దస్వాములు, ఎల్లప్ప, రుద్రప్రసాద్, బోధనం, మధు, ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఒకే నంబర్‌పై రెండు సేవా దర్శనం టిక్కెట్లు

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో సేవా దర్శనం టిక్కెట్ల పంపిణీలో గోల్‌మాల్ జరిగిందని మహానంది ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న ఆలయ ప్రాంగణంలో భక్తులకు సేవా టిక్కెట్లు విక్రయించే కౌంటర్‌లో ఒకే నంబర్‌పై రెండు టిక్కెట్లు రావడంపై మహానందిలో ఆదివారం దుమారం లేచింది. ఈ విషయంపై టిక్కెట్టు తీసుకున్న భక్తుడు మహానంది ఆలయ పరిరక్షణ సమితి సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వారు టిక్కెట్టు ఇచ్చే విషయంలో గోలమాల్ జరిగిందని నిర్ధారించుకొని చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయితే సాంకేతిక సమస్యల వల్లే ఇలా జరిగిందని, టిక్కెట్ల విక్రయంలో అవినీతి జరిగే అవకాశం లేదని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు.

మహానందిలో ఆర్‌అండ్‌బీ ఎలక్ట్రికల్ సీఈ

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీకమాసం పురస్కరించుకొని ఆర్ అండ్‌బి ఎలక్ట్రికల్ సీఈ బుచ్చిరాజు కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ముఖ మండపం వద్ద ఆలయ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో సీఈ ప్రత్యేక అభిషేకార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు సన్మానించి స్వామివారి ప్రసాదాలు, మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక నిర్వీర్యం

- అటకెక్కిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాలు


● మినరల్ వాటర్‌కు అలవాటు పడ్డాం
కార్డు ద్వారా మినరల్ వాటర్‌కు తీసుకునే విధానానికి అలవాటు పడ్డాం. నెలకోసారి రూ.140 చెల్లించి ప్రతి రోజూ మినరల్ వాటర్ తీసుకెళ్లేవాళ్లం. సంవత్సర కాలంగా ఆర్డీయూ ద్వారా మంచి నీరు రావడం లేదు. ప్రభుత్వం మినరల్ వాటర్ అందించాలి.
- వివేకానందరెడ్డి, 10 బొల్లవరం గ్రామం



● ప్రభుత్వ ధనం వృథా
ఆర్వో ప్లాంట్ ఉపయోగంలో లేకపోవడం వల్ల కోట్ల రూపాయాలు వృథా అయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడం, వారికి కనీస అవగాహన లేకపోవడం బాధాకరం. ఆర్.డి.యూ శుద్ధ జల ప్లాంట్‌ను పునఃప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించాలి.
- వీరం ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, నందికొట్కూరు

నందికొట్కూరు మండల పరిధిలోని గ్రామాలకు శుద్ధజలాలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నీరుగార్చింది. కార్డు పద్ధతి ద్వారా గ్రామాల్లో మినరల్ వాటర్‌ను అందించే ఉద్దేశంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి టీడీపీ ప్రభుత్వం నిర్మిస్తే... గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించి. పట్టుమని సంవత్సరం కూడా మినరల్ వాటర్‌ను వైసీపీ ప్రభుత్వం అందించలేదు. నిర్వహణకు నిధులు కేటాయించక పోవడంతో మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడింది. గ్రామాల్లో ఉన్న ఆర్.డి.యూ. ఆర్వో ప్లాంట్ల చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి.


మల్యాల వద్ద నిరుపయోగంగా మదర్ వాటర్ ప్లాంట్

నందికొట్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7 ఆర్.డి.యు(రిమోట్ వాటర్ డిస్పోజింగ్ యూనిట్) వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించారు. నందికొట్కూరు మండలంలోని 12 పల్లెలకు మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో రూ.2.51 కోట్లతో మల్యాల గ్రామం వద్ద మదర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి శుద్ధి చేసిన జలాలను 4 స్టీల్ ట్యాంకర్ల ద్వారా మండల పరిధిలోని కొణిదేల, బిజినవేముల, అల్లూరు, శాతనకోట, వడ్డెమాను, 10 బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, మల్యాల, కోళ్లబావాపురం, తదితర గ్రామాలకు అందిస్తారు. ఆయా గ్రామాల్లో 15 ఆర్.డి.యూ యూనిట్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు కార్డులను పంపిణీ చేశారు. రూ.140 చెల్లిస్తే నెలంతా తాగు నీరు తీసుకోవచ్చు. ఆ విధంగా టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2021లో ఈ పథకానికి వైఎస్ఆర్ సుజల స్రవంతి అని పేరు మార్చారు. కాని గుత్తేదారుకు ప్లాంట్ ఏర్పాటు బిల్లులు చెల్లించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దీంతో చివరికి మదర్ ప్లాంట్, ఆర్.డి.యూల నిర్వహణ ఖర్చులు కూడా వైసీపీ ప్రభుత్వం చెల్లించడంలో నిర్లక్ష్యం వహించింది. దీంతో ఈ పథకం అమలు మూడునాళ్ల ముచ్చటగా మారింది. ఈ ప్రభుత్వమైన నిర్వహణకు నిధులు కేటాయించి ప్రజలకు మినరల్ వాటర్‌ను అందించాలని నందికొట్కూరు మండల ప్రజలు కోరుతున్నారు.


10 బొల్లవరం వద్ద తాళం తెరుచుకోని ఆర్‌డీయూ ప్లాంట్

రామ్మూర్తి మృతి బాధాకరం: మంత్రి ఫరూక్


రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల, నవంబరు 17 : (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి మంత్రి ఫరూక్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, వ్యవసాయ మార్కెటింగ్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

● తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేసిన విధేయులకు పదవులు లభించాయని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. కుడా చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన నంద్యాలకు చెందిన నాగేంద్రలు ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరినీ ఫరూక్ సన్మానించారు. కార్యక్రమంలో కొట్టాల శివనాగిరెడ్డి, పబ్బతి వేణు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల పట్టణ శివారులోని చిన్న చెరువును మినీట్యాంక్ బండ్‌లా అభివృద్ధి చేసి వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని చిన్న చెరువులో జిల్లా కనోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాల, బాలికలు, సీనియర్స్ మహిళలు, పురుషుల పడవల పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల నుంచి వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు 200 మంది క్రీడాకారులు వచ్చారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి ఫరూక్‌తోపాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, నంద్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నంద్యాల క్రీడా సమాఖ్య గౌరవాధ్యక్షుడు డా.రవికృష్ణ, పీవీ గ్రూప్స్ అధినేత పబ్బతి వేణుగోపాల్, రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● **నంద్యాల కల్చరల్:** ఆర్యవైశ్యులకు టీడీపీ సముచిత స్థానం కల్పించిందని న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం నంద్యాల మూలమఠం నందు బాలాజీ కాంప్లెక్స్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజ కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్తీకమాస వనభోజన కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, వ్యవసాయ మార్కెటింగ్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రాజేశ్వరరావు హాజరయ్యారు.

బిల్వ పత్రాలపై కార్తీక శోభ


బిల్వ పత్రాలపై కార్తీక శోభ చిత్రాలు


బిల్వ పత్రంపై చిత్రాన్ని గీస్తున్న కోటేష్

నంద్యాల కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ కార్తీక మాసం పురస్కరించుకొని మూడు బిల్వపత్రాలపై కార్తీకశోభ చిత్రాన్ని వేశారు. ఈ చిత్రంలో ఒక బిల్వ పత్రంపై పరమ శివుడు భక్తులను దీవిస్తున్నట్లు, రెండో బిల్వ పత్రంపై ద్వాదశ జ్యోతిర్లింగాలు, మూడో భక్తులు నదీస్నానం చేస్తున్నట్లు, మహిళలు కార్తీక దీపాలు వదులుతున్నట్లు, భక్తులు భక్తితో శివుడ్ని కొలుస్తున్నట్లు చిత్రాన్ని అద్భుతంగా చిత్రకారుడు కోటేష్ తీర్చిదిద్దారు.

పుస్తకాలు సమాజపు దారి దీపాలు


గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

నంద్యాల కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానపు దారి దీపాలని సాహితీవేత్త డాక్టర్ గెలివి సహదేవుడు అన్నారు. నంద్యాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పింగళి సూరన స్మారక గ్రంథాలయం నంద్యాల శాఖలో గ్రంథాలయాధికారి రాధాబాయి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంతాలయ పితామహులైన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, వెంకటరమణయ్య తదితరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. డాక్టర్ గెలివి సహదేవుడు నేతృత్వంలో కవి సమ్మేళనం, రచయిత కొప్పుల ప్రసాద్ రచించిన 'పసి నవ్వులు అలలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ కిషోర్‌కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, నీలకంఠమాచారి, మహబుబ్‌బాషా, శేషఫణి, రత్నలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది శ్రీధర్, ఆదినారాయణ, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్‌లు అన్నారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. పేదలకు రెండు సెంట్లు ఇవ్వాలని అన్నారు. గృహ నిర్మాణ పథకం కింద రూ.5 లక్షల సాయాన్ని అందించాలని కోరారు. 2001 నుంచి 2003లో పొందిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారని, అదే విధంగా జగనన్న కాలనీల్లో ఏర్పాటైన జాతీయ రహదారి విస్తరణ వల్ల లబ్ధిదారులు తమ స్థలాలు కోల్పోయారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సురేంద్ర, ఇస్మాయిల్, మంజుల, సద్దాం, జబివుల్లా పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండల పరిధిలోని గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహనాయక్, నాయకులు వెంకటేశ్వర్లులు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నవంబరు 19న నిర్వహించే సీపీఎం మూడో సభలో పలు తీర్మానాలు చేసి వాటిపై పోరాటాలకు సిద్ధం కానున్నామని తెలిపారు. అర్హులైన ప్రజలందరికి ఇంటి స్థలాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాడ్ చేశారు. ఉపాధి కూలీలందరికీ 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600ల కూలి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేంద్ర పాల్గొన్నారు.

భక్తుల పట్ల అర్చకుడి దురుసు ప్రవర్తన

ఆత్మకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రంలోని ఓ అర్చకుడి తీరు పట్ల భక్తులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అమ్మవారి సన్నిధిలోనే ధూమపానం చేయడం, భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించడం చర్చగా మారింది. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలానికి చెందిన కొంత మంది భక్తులు ఆదివారం మధ్యాహ్నం కొలనుభారతి క్షేత్రానికి చేరుకున్నారు. అయితే 12.25 గంటల సమయానికే అక్కడి అర్చకులు చక్రపాణిశర్మ ఆలయ తలుపులు మూసివేశాడు. అయితే ఆ భక్తులు ఎంతో దూరం నుంచి ఇక్కడికి వచ్చామని, దర్శించుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రాధేయపడ్డారు. దీంతో ఒక్కసారిగా సదరు అర్చకులు చక్రపాణిశర్మ దురుసుగా వ్యవహరించారు. అమ్మవారికి చీరసారె తెచ్చామని ఆలయం తలుపులు తెరవాలని విన్నవించారు. చీర మాత్రమే ఇస్తే సరిపోదని తనకు రూ.501 సంభావన ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అడిగిన డబ్బు ఇవ్వగానే ఆలయ తలుపులు తెరిచి తూతూమంత్రంగా మంత్రాలు చదివి పూజను పూర్తి చేశాడు. అనంతరం ఆలయ గదిలో కూర్చొని బహిరంగంగానే ధూమపానం చేశాడు. ఈ దృశ్యాలన్నీ సదరు భక్తులు వారు సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. అర్చకుడిపై చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ అధికారులను వారు కోరారు. సదరు అర్చకుడిపై విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని దేవస్థానం ఈవో రామలింగారెడ్డి అన్నారు. కొలనుభారతి సన్నిధిలో ఇలాంటి అపచారాలను ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

నంద్యాల క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా శాంతికి భంగం కలిగించేవారిపై చర్యలు తప్పవని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గత 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది డ్రోన్ కెమెరాల సాయంతో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు రెండు నాటుసారా కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 37 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 71 మందితోపాటు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న వారిపై 62 కేసులు నమోదు చేసి రూ.5810 జరిమానా విధించామన్నారు. ఎంవీఐ చట్టం కింద డ్రైవింగ్ లైసెన్స్‌లు, ధ్రువపత్రాల్లేని 423 మందిని గుర్తించి రూ.2,33,585 జరిమానా విధించినట్లు వెల్లడించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో భాగంగా 25 మందిని గుర్తించి 21 వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మట్కా, జూదం తదితర వాటిపై దాడులు చేసి శిరివెళ్ల, నంద్యాల వన్‌టౌన్, కొలిమిగుండ్ల తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు కేసుల్లో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.29,616 స్వాధీనం చేసుకున్నామన్నారు. డోన్ రూరల్ పోలీస్ స్టేషన్, బేతంచెర్ల, నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జూదరులపై దాడి చేసి మూడు కేసుల్లో 17 మందిని అరెస్ట్ చేయడంతోపాటు వారి వద్ద నుంచి రూ.1,29,040 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నేరచరిత్ర గలవారు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

వైభవంగా పల్లకి సేవ


పల్లకిలో పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, నవంబరు 17(ఆంధ్రజోతి): శ్రీశైల క్షేత్రంలో లోకకళ్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేసి పల్లకిలో ఆశీనులనుజేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం కుప్పా కృష్ణవేణి బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మూషిర వాహన, నమశ్శివాయతే, భో శంభో, అయిగిరి నందిని తదితర గీతాలకు డి. హరిణి, బి. చైత్రశ్రీ, నాగతేజస్వి, కుప్పా కృష్ణవేణి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. తరువాతి కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ బృందంచే గణేశస్తుతి, శివశంకర, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు మీనాక్షి, వైష్ణవి, విద్యాసాగర్, అవిష్న, మృత్తిక, నిధి తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడకు చెందిన డి.వెంకటేష్ సాక్షి కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



సాంప్రదాయ నృత్య ప్రదర్శన

తరగతి గదికి వెళ్లేదెలా..?

గడివేముల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణం, క్రీడా మైదానం పంట కాలువ నీటితో మునిగిపోయింది. హైస్కూల్ ఆవరణలో పంట కాలువ ప్రవహిస్తోంది. హైస్కూల్ ప్రాంగణం నుంచి క్రీడా మైదానానికి వెళ్లే దారిలో కాలువపై తక్కువ పరిమాణంగల పైపులు వేశారు. కాలువకు నీరు అధికంగా రావడంతో నీరు పైపులగుండా ప్రవహించలేక కాలువ ఎక్కి పారింది. పాఠశాల ప్రాంగణం, క్రీడా మైదానంలోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మోకాలి లోతు నీటిలో నుంచి తరగతి గదిలోకి వెళ్లాల్సి ఉంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పంట కాలువ నీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


నీట మునిగిన హైస్కూల్ ప్రాంగణం

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి : డీఎస్పీ



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రవి కుమార్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సైతం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్‌ఆర్ అకాడమీ క్రీడాకారులకు దాతలు అందజేసిన క్రీడా దుస్తులు, షూష్‌లను డీఎస్పీ ఆదివారం పంపిణీ చేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న ప్రోత్సాహకాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో దాతలు, అకాడమీ నిర్వాహకులు ఎస్‌వీఎన్ హరి ప్రసాద్‌రెడ్డి, దత్తేశ్వరరెడ్డి, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుజాత, కోచ్ సుబ్బరాయుడు, ఏవీ రామసుబ్రమణ్యం, వినోద్ కుమార్, వంశీ, భువన శేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

వనభోజనాలు భారతీయ సంస్కృతికి చిహ్నం



వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వనభోజనాలు భారతదేశ సంస్కృతికి చిహ్నమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కుర్నిసంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో ఇలాంటి వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడం హిందువులకు ఆనవాయితీ అన్నారు. అందరు కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కుర్నిసంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

తైల కలశాలతో మహిళల పాదయాత్ర



కలశాలతో పాదయాత్రగా వెళ్తున్న మహిళలు

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని హట్టిమునిస్వామి ఆశ్రమం నుంచి నందవరంలోని చౌడేశ్వరీమాత ఆలయానికి తైల కలశాలతో మహిళలు పాదయాత్రగా ఆదివారం బయలుదేరారు. లోక కల్యాణార్థం ప్రతి ఏటా కార్తీక మాసంలో బనగానపల్లె హట్టిమునిస్వామి ఆలయం నుంచి విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళలు చౌడేశ్వరీ మాతను దర్శించుకున్నారు. ఫణి, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్డి సంఘం కార్తీక వనభోజనం

డోన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని రెడ్డి భవనం మైదానంలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ డోన్ నియోజకవర్గ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి హాజరయ్యారు. వనభోజనం సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు కోట్ల రాఘవేంద్రరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, నాయులు ధర్మవరం గౌతంరెడ్డి, భరత్‌రెడ్డి, సర్పంచు రేగటి అర్జున్‌రెడ్డి, సిద్ధార్థ కృష్ణారెడ్డి, హేమ సుందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి నిత్యావసరాల అందజేత

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అహోబిలం గ్రామంలో ఇటీవల గుడిసె దగ్ధమవ్వడంతో నిరాశ్రయుడైన దివ్యాంగుడికి ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సభ్యులు అండగా నిలిచారు. బాధితుడు కోనేటి కృష్ణకు రెండు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులను వారు ఆదివారం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడంతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ హుసేన్, హరీష్, బాషా, శివ, సద్దాం, నూరుల్లా, మహబూబ్ పాల్గొన్నారు.

కర్రలే ఆధారం

- శిథిలావస్థలో పోలీస్ స్టేషన్ భవనం
- పైకప్పు కూలకుండా కర్రలు ఏర్పాటు
- భయం గుప్పిట్లో పోలీసులు
- నివాసయోగ్యం కాని క్వాటర్స్

చాగలమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. బ్రిటిష్ కాలం నాటి నిర్మాణం, చెక్క దంతెలతో వేసిన పైకప్పు భవనం కావడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. పోలీసులు, సిబ్బంది దంతెలు, దూలాలు కూలకుండా అడుగుభాగాన కర్రలు ఏర్పాటు చేశారు. వాటి కిందనే పోలీసులు విధులు నిర్వహిస్తు న్నారు. ఎప్పుడు కూలుతుందోనని పోలీ సులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప లువురు కోరుతున్నారు.

శిథిలావస్థలో క్వాటర్స్

చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నివసించేందు కు నిర్మించిన క్వాటర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి పోలీసులు నివాసం ఉండేందుకు గతంలో క్వాటర్స్ నిర్మించారు. భవనాలు లోపలి భాగం దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. దీంతో పోలీసులు అద్దె ఇళ్లలో ఉంటున్నారు. కొత్త భవనాలు నిర్మిస్తే పోలీసులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కేంద్రంలో అధి కారులు, సిబ్బంది నివాసం కోసం నిర్మించిన క్వాటర్స్ ముళ్ల కంపల మధ్య అధ్వానంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించారు. వీటిలో కొద్దికాలం సిబ్బంది, అధి కారులు నివాసం ఉన్నారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉన్నతాధికారులు స్పం దించి భవనాలకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకొని రావాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పోలీసు క్వాటర్స్



చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో దంతెలకు సపోర్టుగా ఏర్పాటు చేసిన కర్రలు

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

బనగానపల్లె , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవిసమ్మేళనం కార్యక్రమాన్ని గ్రంథాల యాధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 57వ శాఖా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించి కవులను సత్కరించారు. నందివర్గం జడ్పీ ఉన్నతపాఠశాల స్కూల్ అసిస్టెంట్ కవి పూజారి శ్రీనివాసులు మాట్లాడుతూ సాహిత్య సామాజిక అంశాలు, సాంస్కృతిక సాంకేతిక పరిజ్ఞానం గ్రహించడానికి గ్రంథ పఠనం ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులు ఈ విషయాలను తెలుసుకునేందుకు గ్రంథాలయాను ఉపయోగించుకోవాలని కోరారు. పూర్వ కవుల గ్రంథాలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. శతక పద్యాలు చదవడం వల్ల లోకం రీతి, లోకజ్ఞానం కలుగుతుందన్నారు. ఈసందర్భంగా తాను రచించిన పద్యాలు భావయుక్తంగా చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు హరినాథ్‌గౌడ్, రిటైర్డు హెచ్‌ఎం శ్రీరాములు, మహమ్మద్ ఇక్బాల్ తదితర కవులను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ క్రాఫ్ట్ టీచర్ బాబు గిద్దలూరు గ్రంథాలయ నిర్వాహకులు మద్దిలేటి, అటెండర్ బేల్తాజర్, ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో కవులను సత్కరించిన గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళనం గ్రంథాలయ అధికారి బాలతిమ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గేయ కవి రిటైర్డ్ తెలుగు పండిట్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి విద్యార్థులకు చదువు - సంపద - సంస్కారం గురించి గేయ రూపంలో తెలిపారు. అదేవిధంగా గ్రంథాలయాల యొక్క ప్రాముఖ్యతపై వివరించారు.

శిరివెళ్ల : విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని లైబ్రేరియన్ సుజాత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శిరివెళ్లలోని గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కోవెలకుంట్లలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి తిమ్మారెడ్డి



శిరివెళ్లలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

రామ్మూర్తి నాయుడుకు నివాళి

ప్యాపిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన నారా రామ్మూర్తి నాయుడు మృతిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, వెంకటరాముడు, రామాంజినేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు (72) మృతి బాధాకరమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాష అన్నారు. ఆదివారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆయన సేవల గురించి గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, లాలయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

డోన్: సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడికి టీడీపీ డోన్ నాయకులు నివాళి అర్పించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ సర్పంచు కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, కొత్తకోట శ్రీను, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డే మహారాజ్ తదితరులు రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, పెద్దయ్య, బాలుడు, సుధాకర్, సంజీవుడు, అశోక్, బాషా తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

టీడీపీకి కార్యకర్తలే బలం



శిరివెళ్లలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలే బలమని ఆ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుడు బీసీ ఫిదా హుసేన్ అన్నారు. ఆదివారం శిరివెళ్లలో టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవ డం వల్ల కలిగే బీమా ప్ర యోజనాలను ప్రజలకు వివ రించారు. ప్రజలు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి పా ర్టీ సభ్యత్వాన్ని నమోదు చే యించుకుంటున్నారని అ న్నారు. టీడీపీ నాయకులు షఫీవుల్లా, జానీ, కరీం, రహీం, సలాం పాల్గొ న్నారు.

టీటీడీ సభ్యుడిని సన్మానించిన శ్రీనివాసరెడ్డి

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్ గౌడ్ ఆదివారం ఆళ్లగడ్డకు వచ్చారు. పట్టణంలోని టీడీపీ నాయకుడు, కేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ సీపీ శ్రీనివాసరెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్ గౌడ్‌ను సీపీ శ్రీనివాసరెడ్డి శాలువాతో సత్కరించారు.



పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ కుటుంబ సభ్యులు

నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కొలిమిగుండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం నేలబిళం మల్లేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక మాసం ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బాలవెంకటరెడ్డి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి, విశేష పుష్పాలంకరణ చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

కార్తీక దీపం అసలైన పవిత్రతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు సంజీవ్‌బాబు, సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని బెలుం గ్రామంలో త్రైతసిద్ధాంతం భగద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబు, జనార్దన్, మద్దిలేటి, పెద్దయ్య, గణపతి, మల్లేశ్ పాల్గొన్నారు.

బనగానపల్లె: కార్తీక మాసంలో ప్రతి మహిళ కార్తీక దీపాలు వెలిగించాలని త్రైత సిద్ధాంత కమిటీ ధర్మకరం కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం బనగానపల్లె మండలంలోని రామకృష్ణాపురంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథముల ద్వారా ప్రచారం చేశారు. కార్తీక పౌర్ణమి రోజుల్లో దేవాలయాల్లో ధ్వజస్థంభంపై దీపాలు వెలిగిస్తారన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, పరుశరాముడు, వెంకటేశ్, రఘు రామిరెడ్డి, వెంకటరాముడు, శ్రీనివాసులు రాజ శేఖర్, మనోహర్, అనిల్, జయేశ్వరి, మద్దమ్మ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని వేంకటేశ్వరస్వామిని ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారా యణరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. లక్ష దీపాల మహోత్సవం పాల్గొన్నా రు.



కోవెలకుంట్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న మూలపెద్దమ్మ

దొర్నిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కులమతాలకు అతీతంగా అమ్మవారికి కాయకర్పూ రాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ మారెమ్మ సుంకులమ్మ అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించి భక్తులు తమ భక్తిని చాటారు. మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, యల్లావత్తుల చిన్నకంబలూరు గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పోలీసుల అదుపులో ట్రిప్పర్లు

బనగానపల్లె, 17 నవంబరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఐదు గ్రావెల్ టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ ఆదివారం తెలిపారు. గాలేరు నగరి కాలువ సంబంధించి గ్రావెల్‌ను తరలిస్తుండగా నగరి కాలువ అధికారులు ఫిర్యాదు చేయడంతో స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. అధికారులు విచారణ అనంతరం గ్రావెల్ తమది కాదని నిర్ధారణ అయితే ట్రిప్పర్లను వదులుతామన్నారు. లేదంటే సీజ్ చేస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

చాగలమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రెండు ట్రాక్టర్లు వైఎస్సార్ జిల్లా దేవగుడి నుంచి వచ్చినట్లు గుర్తించారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్‌గా కిశోర్‌కుమార్

బనగానపల్లె , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్‌గా బనగానపల్లె జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు కిశోర్‌కుమార్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా ఆత్మకూరు జూనియర్ కళాశాల అధ్యాపకుడు శివకృష్ణమాచారి, వైస్ చైర్మన్‌గా బాల ఓబన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నంద్యాల ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ హక్కుల కోసం పోరాడతామని చైర్మన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



దేవతామూర్తుల విగ్రహాలు

కోవెలకుంట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో వెలసిన సత్యనారాయణస్వామి దేవాలయంలో దేవతామూర్తుల విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ఆలయంలో మానసదేవి, కుమారస్వామి, నాగ దేవతగ్రమూర్తులను ఆదివారం మూడోరోజు ఘనంగా పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీరాములు

ఉయ్యాలవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా కొత్తమిద్దె శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉయ్యాలవాడ గ్రామంలో మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేస్తామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరామ్‌కుమార్, అమీర్‌భాష పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామికి పూజ చేస్తున్న భక్తులు

అవుకు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అవుకు పట్టణ సమీపంలోని సుద్దకొండమీద వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. గురుస్వాములు వెంకటరమణనాయక్, టైలర్ సుబ్బయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి పడిపూజకు హాజరయ్యారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

రుద్రవరం నుంచి.. శబరిమలైకు పాదయాత్ర

రుద్రవరం: రుద్రవరం గ్రామానికి చెందిన పాములేటి స్వామి, ఆర్.కొత్తూరుకు చెందిన వీరభద్రుడుస్వామి ఆదివారం కాలినడకన శబరిమలైకి బయల్దేరారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీడ్కోలు పలికారు. అయ్యప్పస్వాములకు టీడీపీ మండల కన్వీనరు రంగనాయకులు పూలమాల వేసి వీడ్కోలు పలికారు.

వీధి లైట్ల ఏర్పాటు

కొలిమిగుండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పలు వీధుల్లో వీధి లైట్ల ఏర్పాటును గ్రామ సర్పంచ్ శివరాముడు ఆదివారం ప్రారంభించారు. పలు కాలనీల్లో వీధి లైట్లు వెలగక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు లైట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో వీధుల్లో వెలుగులు సంతరించుకున్నాయి.

ప్రియా సిమెంట్స్ సున్నపురాయికి బహుమతులు

ప్యాపిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన సున్నపురాయి భద్రతా వారోత్సవాల్లో రాచెర్ల ప్రియా సిమెంట్ సున్నపురాయికి వివిధ విభాగాల్లో బహుమతులు వచ్చినట్లు ఆ పరిశ్రమ పీఆర్‌వో కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్‌తా, సుప్రియా బహుమతులు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

పెళ్లి కానుక పంపిణీ

బనగానపల్లె , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఆదివారం నవవధువు కుటుంబానికి పెళ్లికానుక కిట్‌ను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పంపిణీ చేశారు. రామాపురం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ, పెద్దనాగయ్య దంపతుల కుమార్తెకు పెళ్లి కానుక అందించారు.

వానరానికి అంత్యక్రియలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నిమ్మకాయల మార్కెట్ ఎదురుగా ఉన్న కాలనీలో ఓ వానరం మృతి చెందింది. కాలనీకి చెందిన ఈపన గండ్ల శ్రీనివాసులు వానరానికి సాంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు.